క్లుప్తంగా

విద్యార్థులు కష్టపడి చదవాలి



నూజివీడు: ఇంజినీరింగ్ విద్యార్థులు నేడు ఉన్న పోటీ ప్రపంచంలో రాణించాలంటే కష్టపడి చదవాలని సబ్‌కలెక్టర్ ఆదర్ష్ రాజేంద్రన్ అన్నారు. పట్టణంలోని సారథి ఇంజినీరింగ్ కళాశాల సాంకేతిక సంబరమైన సారథి ఫెస్ట్–23, రజోత్సవ వేడుకల ముగింపు కార్యక్రమం గురువారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న సబ్‌కలెక్టర్ మాట్లాడుతూ దేశాభివృద్ధిలో ఇంజినీరింగ్ విద్య పాత్ర ఎంతో కీలకమన్నారు. అనంతరం సబ్‌కలెక్టర్ ఆదర్ష్ రాజేంద్రన్ కళాశాల యాజమాన్యం, అధ్యాపకులు సన్మానించారు. కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ స్వర్ణశ్రీ, చైర్మన్ ఎస్వీ సుధీర్, డైరెక్టర్ సాయిరామ్ కుమార్, ప్రిన్సిపాల్ సూరానేని శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

మైలవరం సీఐ, ఎస్ఐలు బదిలీ



మోహన్‌రెడ్డి, సీఐ



రాంబాబు, ఎస్ఐ

మైలవరం: మైలవరం సీఐ ఎల్.రమేష్, ఎస్ఐ పి.రాంబాబు బదిలీ అయ్యారు. మైలవరం సీఐగా మోహన్‌రెడ్డి బాధ్యతలు చేపట్టనున్నారు. అలాగే ఎస్ఐ రాంబాబు తిరువూరు నియోజకవర్గం గంపలగూడెం బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో విజయవాడ నుంచి ఎస్ఐగా లక్ష్మణ్ వస్తారని పోలీస్ కార్యాలయం గురువారం తెలిపింది.

అంబేడ్కర్ జీవితాన్ని ఆదర్శంగా తీసుకోవాలి



ఆగిరిపల్లి: రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేడ్కర్ జీవితాన్ని ఆదర్శంగా తీసుకుని ఆయన అడుగుజాడల్లో నడవాలని ఎస్‌పే పేట ఫౌండేషన్ ప్లస్ పాఠశాల హెచ్‌ఎం మక్కె వేణుగోపాలరావు అన్నారు. అంబేడ్కర్ జయంతిని గురువారం విద్యార్థుల ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పించారు. ఈదరలో భీమ్‌రావ్ దళిత సంక్షేమ సేవా సంఘం అధ్యక్షుడు మొగదాటి జోజిబాబు ఆధ్వర్యంలో అంబేడ్కర్ జయంతిని నిర్వహించారు.

బాధ్యతలు చేపట్టిన ఉపాధ్యాయులు



గంపలగూడెం: 1998 డీఎస్సీ నియామకాల్లో భాగంగా గంపలగూడెం మండలానికి నలుగురు టీచర్లను ఉన్నతాధికారులు కేటాయించగా గురువారం బాధ్యతలు చేపట్టారని ఎంఈఓ సోమశేఖర్‌నాయక్ తెలిపారు. నాళ్లా వెంకటేశ్వరరావు పెనుగొలను ఎంపీపీఎస్(బీసీ), జి.ఉదయకుమార్ అమ్మిరెడ్డిగూడెం ఎలిమెంటరీ పాఠశాల, వైఎస్వీ మాధవిలత నెమలి ఎలిమెంటరీ పాఠశాల(హెచ్‌డబ్ల్యూ), మద్దిపట్ల నాగలక్ష్మి గోసవీడు ఎలిమెంటరీ పాఠశాల(హెచ్‌డబ్ల్యూ)లకు నియమితులయ్యారు. మినిమం టైం స్కేల్ విధానంపై వీరిని ఉద్యోగాల్లోకి తీసుకున్నట్లు ఎంఈఓ చెప్పారు.

చలివేంద్రాల ఏర్పాటు అభినందనీయం



మైలవరం: బాటసారుల దాహార్తిని తీర్చడానికి చలివేంద్రాల ఏర్పాటు అభినందనీయమని వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.హరినాథరెడ్డి తెలిపారు. మైలవరం లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజినీరింగ్ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో గురువారం కళాశాల గేటు వద్ద ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ప్రారంభించారు. కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ అధికారి డాక్టర్ బి.శివహరిప్రసాద్‌ను విద్యార్థులను కళాశాల ప్రెసిడెంట్ జి.శ్రీనివాస రెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ కె.అప్పారావు, అధ్యాపకులు అభినందించారు.

చలివేంద్రం పరిశీలన

చాట్రాయి: వేసవిలో ప్రయాణికుల దాహార్తిని తీర్చడానికి చలివేంద్రాలు దోహదపడతాయని తహసీల్దార్ విశ్వనాథరావు తెలిపారు. మండలంలోని చనుబండ గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న చలివేంద్రాన్ని గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ పంచాయతీలు లేదా స్వచ్ఛంద సంస్థలు చలివేంద్రాలు ఏర్పాటు చేయాలన్నారు. నాయకులు వనమా వాసు, జల్లేపల్లి పరమేశ్వరరావు, శివకుమార్, రామకృష్ణ, మేడా రాము, దార్ల వినోద్ కోటేశ్వరరావు పాల్గొన్నారు.

ప్రతి గడపకు జగనన్న సంక్షేమ పథకాలు

ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్



మైలవరంలో ప్రభుత్వ పథకాల బ్రోచర్ అందజేస్తున్న ఎమ్మెల్యే వసంత

మైలవరం: నియోజకవర్గంలోని ప్రతి గడపకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అందుతున్నాయని ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ తెలిపారు. మైలవరం గ్రామ సచివాలయం – 5 పరిధిలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం 64వ రోజు గురువారం జరిగింది. ఎమ్మెల్యే వసంత పాల్గొని గడప గడపకు వెళ్లి ముఖ్యమంత్రి జగన్ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు వివరించారు. ఇంటి యజమానుల నుంచి సమస్యలు అడిగి తెలుసుకుని, సమస్యలు పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఆదరణ కరువైన నిరుపేదలను వైఎస్ జగన్ సంక్షేమ పథకాలు ఆదుకుంటున్నాయన్నారు. అన్ని వర్గాల ప్రజల మోముల్లో ముఖ్యమంత్రి జగన్ పథకాలు చిరునవ్వులు చిందిస్తున్నాయని ఎమ్మెల్యే తెలిపారు. ఇంటి యజమానుల అనుమతితో జగనన్నే మా భవిష్యత్తు, నువ్వే మా నమ్మకం జగన్ స్టిక్కర్లు ఇంటి తలుపులకు, సెల్‌ఫోన్‌లకు అతికించారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, గ్రామ సచివాలయ సిబ్బంది, అధికారులు, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు. మండలంలోని వెల్వడం, తోలుకోడు, చంద్రాల, పుల్లూరు గ్రామాల్లో జగనన్నే మా భవిష్యత్తు, నువ్వే మా నమ్మకం జగనన్న కార్యక్రమాలు నిర్వహించారు.

గడప వద్దకే ప్రభుత్వ పాలన

ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు



ముక్కొల్లుపాడులో ప్రభుత్వ పథకాల బ్రోచర్ అందజేస్తున్న ఎమ్మెల్యే ప్రతాప్ అప్పారావు

నూజివీడు: గతంలో ఎన్నడూ లేనివిధంగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వ పాలనలో గడప వద్దకే సంక్షేమ పథకాలు అందిస్తూ లక్షలాది రూపాయల లబ్ధి చేకూరుతోందని ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు అన్నారు. మండలంలోని ముక్కొల్లుపాడులో గురువారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎమ్మెల్యే గ్రామంలో ఇంటింటికీ పర్యటించి ప్రభుత్వం అందజేస్తోన్న సంక్షేమ పథకాల వల్ల కలిగిన లబ్ధిని ఆయా కుటుంబాల వారికి వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రతాప్ మాట్లాడుతూ.. గడప వద్దకే పింఛన్, రేషన్‌ను ప్రభుత్వం అందజేస్తోందన్నారు. నాడు–నేడు పథకం ద్వారా ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేసిన ఘనత వైఎస్సార్ సీపీదేనన్నారు. రాష్ట్రంలోని ప్రతి కుటుంబం ఆర్థికాభివృద్ధి సాధించాలంటే రాబోయే ఎన్నికల్లో మళ్లీ జగన్‌ను గెలిపించుకోవాలన్నారు. టీడీపీ నాయకుల మాయమాటలు నమ్మి మోసపోవద్దని, చంద్రబాబును నమ్మితే రాష్ట్రం అథోగతి పాలవుతుందని స్పష్టం చేశారు. రాష్ట్ర విద్యా, సంక్షేమ మౌలిక సదుపాయాల సంస్థ డైరెక్టర్ కలగర వెంకటేశ్వరరావు, సర్పంచ్ కంచర్ల సుబ్బలక్ష్మి, ఉప సర్పంచ్ కలగర శివసాయి, ఎంపీడీఓ సుందరి, తహసీల్దార్ డీవీఎస్ యల్లారావు, ఏపీఎం దయాల రాజశేఖర్, ఏపీఓ సోమేశ్వరి, నాయకులు ముల్లంగి జమలయ్య తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికే 'గడప గడపకు మన ప్రభుత్వం'

ఎమ్మెల్యే రక్షణనిధి



ఏ.కొండూరులో ప్రభుత్వ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే రక్షణనిధి

ఏ.కొండూరు: ప్రజా సమస్యలు పరిష్కరించటానికే గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నామని స్థానిక ఎమ్మెల్యే కె.రక్షణనిధి తెలిపారు. మండలంలోని ఏ.కొండూరులో రెండో రోజు గురువారం గడప గడపకు మనప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతి గడపకు వెళ్లి వారి సమస్యలు తెలుసుకొని, సమస్యలను పరిష్కరించాలని సంబంధిత అధికారులకు సూచించారు. ప్రభుత్వ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్ ఆనాడు ప్రజా సంకల్పయాత్రలో ఇచ్చిన హామీలు అమలు చేస్తున్నారన్నారు. ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ కాలసాని నాగలక్ష్మి, జెడ్పీటీసీ భూక్య గనియా, వైస్ ఎంపీపీ సిద్దం పద్మ, సర్పంచ్ వెంపాటి రజిని, నాయకులు కాలసాని చెన్నారావు, పాలం ఆంజనేయులు, కోటగిరి రాంబాబు, సతీష్, సొలా నరసింహారావు, ఎంపీటీసీ కోట పుల్లారావు, వివిధ శాఖల అధికారులు, గ్రామ సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.


'దేవినేని ఉమా విమర్శలు హాస్యాస్పదం'



వసంత వెంకట కృష్ణప్రసాద్, ఎమ్మెల్యే

మైలవరం: మాజీ మంత్రి దేవినేని ఉమా తనను విమర్శించడం హాస్యాస్పదంగా ఉందని ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ తెలిపారు. మైలవరం ఎమ్మెల్యే కార్యాలయంలో గురువారం జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే వసంత మాట్లాడుతూ ఎమ్మెల్యేగా, మంత్రిగా పనిచేసిన ఉమా మైలవరం నియోజకవర్గం అభివృద్ధికి ఏమి చేశాడో చెప్పకుండా, పచ్చపత్రికలను అడ్డం పెట్టుకుని అవాకులు, చవాకులు పేలినా నమ్మే వారు లేరన్నారు. రాజకీయ నిరుద్యోగి అయిన ఉమా నిత్యం వైఎస్సార్ సీపీ ప్రభుత్వాన్ని విమర్శించడం, తనపై నిందలు వేయడం పనిగా పెట్టుకున్నాడని విమర్శించారు. జక్కంపూడి, వెలగలేరు, కొత్తూరు తాడేపల్లి, షాబాదు గ్రామాల్లో అక్రమ మైనింగ్ జరుగుతోందని స్వయంగా తాను కలెక్టర్‌కు లేఖ రాశానని, లేటర్ రాసిన తరువాత ఉమా అక్కడకు వెళ్లి పరిశీలించి, హడావుడి చేశాడన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికి, తనకు వస్తున్న మంచి పేరు చూసి తట్టుకోలేక పాత కథలే మళ్లీ చెప్పుకుంటూ తప్పుడు ప్రచారం చేస్తు కాలం గడుపుకుంటున్నాడన్నారు. విజిలెన్స్ అధికారుల నివేదిక ప్రకారం ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని, అక్కడ ఎంత పెనాల్టీ వేయాలో విధాన నిర్ణయం ప్రకారం చర్యలు ఉంటాయని స్పష్టం చేశారు. ఉమా చేసిన అక్రమాలకు నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ రూ.100 కోట్లు పెనాల్టీ వేశారని, ఆ సొమ్ము చెల్లించాలని తెలిపారు. సీఎం వైఎస్ జగన్ చేసిన అభివృద్ధి సంక్షేమ పథకాలు ఇంటింటికీ చెప్పుకుంటూ తిరుగుతున్నామని, మేనిఫెస్టోలో లేని పథకాలు కూడా అమలు చేసిన ఘనత ముఖ్యమంత్రి జగన్‌దేనన్నారు. మీరు చేసిన అభివృద్ధి ఉంటే చెప్పాలని సవాల్ విసిరారు. సమావేశంలో ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

సమన్వయంతో మండల అభివృద్ధి



నూజివీడు మండల సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ శిరీష

నూజివీడు: మండలంలోని అధికారులు, ప్రజాప్రతినిధుల సమన్వయంతో అభివృద్ధికి కృషి చేయాలని ఎంపీపీ ఆరేపల్లి శిరీష అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో గురువారం ఎంపీపీ శిరీష అధ్యక్షతన మండల ప్రజాపరిషత్ సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ వేసవి కాలం నేపథ్యంలో గ్రామాల్లో మంచినీటి ఎద్దడి లేకుండా సర్పంచ్‌లు, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే గ్రామాల్లో పశువుల కోసం ఉన్న నీటి తొట్టెలను వాడుకలోకి తీసుకువచ్చి వాటిని నీటితో నింపాలన్నారు. చలివేంద్రాలను ఏర్పాటు చేయాలని సూచించారు. అనంతరం పలు ప్రభుత్వ శాఖల పనితీరుపై సమీక్ష నిర్వహించారు. మామిడికి అపారనష్టం ఈ సందర్భంగా ఏఓ ఆలూరు చాముండేశ్వరి మాట్లాడుతూ ఈ నెలాఖరుకు మండలంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభిస్తామన్నారు. ఉద్యాన అధికారి ఆర్.హేమ మాట్లాడుతూ ఇటీవల కురిసిన అకాల వర్షాలకు మామిడిని మంగు ఆశించిందని, అలాగే తామర పురుగులు, తేనె మంచు పురుగు వల్ల మామిడికి అపార నష్టం వాటిల్లిందని, నష్టంపై నివేదికను ఉన్నతాధికారులకు అందించామన్నారు. హౌసింగ్, ఆర్‌డబ్ల్యూఎస్, ఉపాధిహామీ, విద్యుత్, రెవెన్యూ తదితర శాఖలపై సమీక్ష నిర్వహించారు. సమావేశంలో జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ గుడిమళ్ల కృష్ణంరాజు, వైస్ ఎంపీపీలు దండుబోయిన స్వర్ణలత, అక్కినేని శ్రీవాణి, ఎంపీడీఓ ఎంపీఎస్ సుందరి, ఈఓపీఆర్డీ టి.సరస్వతి, ఏపీఎం దయాల రాజశేఖర్, ఏపీఓ సోమేశ్వరి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సుజాత, ట్రాన్స్‌కో ఏఈ త్రిమూర్తులు పాల్గొన్నారు.

విజేతలకు బహుమతుల అందజేత

జి.కొండూరు: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకొని డీవైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో స్థానిక జెడ్పీ హైస్కూల్‌లో గత రెండు రోజులుగా నిర్వహించిన వాలీబాల్ టోర్నమెంట్ విజేతలకు గురువారం బహుమతులను అందజేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎస్ఐ ధర్మరాజు, డాక్టర్ శాగం దినేష్‌రెడ్డి క్రీడాకారులను ఉద్దేశించి ప్రసంగించిన అనంతరం బహుతులను అందజేశారు. నిర్వాహకులు మాట్లాడుతూ వాలీబాల్ టోర్నమెంట్‌లో వెల్లటూరు అంబేడ్కర్ యూత్ ప్రథమ స్థానంలో నిలవగా జి.కొండూరు కెపి యూత్ ద్వితీయ స్థానం, కందులపాడు తృతీయ స్థానంలో నిలిచాయన్నారు. వ్యాసరచన, చిత్రలేఖనం పోటీల విజేతలకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు ప్రసన్న, డివైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి జి.రామన్న, జిల్లా, మండల కార్యదర్శులు ఎస్.నాగేశ్వరరావు, సంగీత సురేష్, క్రీడాకారులు పాల్గొన్నారు.

యోగా శిక్షణ తరగతులు ప్రారంభం



ఇబ్రహీంపట్నం: ప్రతి రోజు యోగా చేయడం ద్వారా వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందని ఎన్టీటీపీఎస్ ఎస్ఈ, వెంకటేశ్వర చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ బాబురావు తెలిపారు. ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన యోగా శిక్షణ తరగతులను ఎన్టీటీపీఎస్ సీ కాలనీ ఆడిటోరియం వద్ద గురువారం ఆయన ప్రారంభించారు. యోగా జీవితంలో ఒక భాగం చేసుకోవాలన్నారు. యోగా గురువు లంకే జనార్దన్ సాధకులతో ఆసనాలు, ప్రాణాయామం ధ్యానం, సూక్ష్మ వ్యాయామాలు చేయించారు. ఎన్టీటీపీఎస్ అధికారులు, ఉద్యోగులు, స్థానికులు పాల్గొన్నారు.

వైభవంగా ధ్వజారోహణం

ఆగిరిపల్లి: మండలంలోని నెక్కలం అడ్డరోడ్డులోని శ్రీదేవి భూదేవి సమేత వేంకటేశ్వర స్వామి ఆలయ ఆరో వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా రెండో రోజు గురువారం ధ్వజారోహణం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం 108 సార్లు హనుమాన్ చాలీసా పారాయణం, ధ్వజారోహణం, అనంతరం సంతానార్థులకు గరుడ ప్రసాదం, కల్యాణోత్సవ హోమాలను చేపట్టారు. అనంతరం రాత్రి ఎదుర్కోలు ఉత్సవం నిర్వహించారు. ఆలయ వ్యవస్థాపకుడు పొట్లూరి వెంకట కృష్ణారావు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

భూసార పరీక్షలు తప్పనిసరి

తిరువూరు: రానున్న ఖరీఫ్ సీజన్‌లో రైతులు సాగుచేయాల్సిన పంటలను ఎంపిక చేసుకోడానికి ముందుగా భూసార పరీక్షలు చేయించాలని తిరువూరు సహాయ వ్యవసాయ సంచాలకులు జి.కెనడీ కోరారు. స్థానిక వ్యవసాయ శాఖ కార్యాలయంలో గురువారం భూసార పరీక్షల నిర్వహణపై వ్యవసాయ సిబ్బందికి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. భూసార పరీక్షల నిర్వహణకు అవసరమైన మట్టి నమూనాలను సేకరించడంలో మెలకువలను వివరించారు. భూసారానికి అనుగుణంగానే ఎరువుల వాడకం, పంటల ఎంపిక తదితర అంశాలు ఆధారపడి ఉంటాయని తెలిపారు. వ్యవసాయాధికారి పద్మ, గ్రామ వ్యవసాయ సహాయకులు పాల్గొన్నారు.

భూసార పరీక్షలపై ఏఏఓలకు శిక్షణ

ఇబ్రహీంపట్నం: వ్యవసాయ భూముల్లో భూసార పరీక్షలు, నేల ఆరోగ్యంపై మండల స్థాయిలో గ్రామ వ్యవసాయ సహాయకులకు స్థానిక వ్యవసాయ శాఖ కార్యాలయంలో గురువారం శిక్షణ కార్యక్రమం జరిగింది. మైలవరం వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు ఎం.శ్రీనివాసరావు భూసార పరీక్షకు మట్టి నమూనాలు తీసే పద్ధతులు, నేల ఆరోగ్యంపై మెలకువలు తెలిపారు. మట్టిని సేకరించే పద్ధతులు వివరించారు. జిల్లా శిక్షణ కేంద్రం వ్యవసాయ అధికారి బి.సత్యవతి, మండల వ్యవసాయ అధికారి శైలజ, గ్రామ వ్యవసాయ సహాయకులు పాల్గొన్నారు.

పదో తరగతి పరీక్షకు 77 మంది గైర్హాజరు

నూజివీడు: డివిజన్ పరిధిలోని 15 పరీక్ష కేంద్రాల్లో పదో తరగతి పరీక్షల్లో భాగంగా గురువారం నిర్వహించిన సైన్స్ పరీక్షకు 55 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. మొత్తం 3406 మందికి 3,351 మంది హాజరవ్వగా 55 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. వేసవికాలం దృష్ట్యా పరీక్షల్లో విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం లేకుండా ఏర్పాట్లు చేశారు.

మైలవరం: మండలంలో గురువారం జరిగిన పదో తరగతి పరీక్షకు 22 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు మండల విద్యా శాఖాధికారి పి.రత్నశ్యామ్‌బాబు తెలిపారు. 1,169 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా 22 మంది విద్యార్థులు గైర్హాజరు కావడంతో 1,147 మంది హాజరయ్యారన్నారు. అలాగే ప్రైవేట్ విద్యార్థులు 112 మందికి గాను 10 మంది గైర్హాజరు కాగా 102 మంది హాజరయ్యారని చెప్పారు.

ఎస్ఏ-2 పరీక్ష పేపర్లు సరఫరా

గంపలగూడెం: ఈనెల 20 నుంచి 29వ తేదీ వరకు నిర్వహించే ఎస్ఏ–2 పరీక్షలకు సంబంధించిన పేపర్లను ఉన్నతాధికారులు గురువారం సరఫరా చేశారని ఎంఈఓ సోమశేఖర్‌నాయక్ తెలిపారు. మండలంలోని 97 ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలతో పాటు ప్రైవేటు పాఠశాల్లో ఒకటి నుంచి తొమ్మిదో తరగతి వరకు విద్యార్థులకు పరీక్షలు నిర్వహిస్తామన్నారు. పేపర్లను ఎమ్మార్సీలో నిల్వ చేశామని చెప్పారు.

ఎంపీపీ ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు

విస్సన్నపేట: పవిత్ర రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని ఎంపీపీ పిల్లి మెర్సీవనజాక్షి, రాజేష్ దంపతుల ఆధ్వర్యంలో స్థానిక మార్కెట్ గోడౌన్ వద్ద గురువారం రాత్రి ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే కొక్కిలిగడ్డ రక్షణనిధి ముఖ్య అతిథిగా పాల్గొని ఇఫ్తార్ విందు వడ్డించారు. అనంతరం ముస్లింలు ఎమ్మెల్యేను సన్మానించారు. జెడ్పీటీసీలు భీమిరెడ్డి లోకేశ్వరరెడ్డి, రామచంద్రారెడ్డి, సర్పంచ్ సాధుపాటి నాగమల్లేశ్వరి, కెడీసీసీబీ డైరెక్టర్ భూక్యా రాణి, నాయకులు సిరసాని ప్రకాష్, నెక్కళపు కుటుంబరావు, శివబాజీ, సత్యనారాయణ రెడ్డి, రెడ్డి శేషగిరి, దస్తగిరి, కరీమా పాల్గొన్నారు.

4,934 మంది విద్యార్థులకు స్టీల్ గ్లాసుల సరఫరా

గంపలగూడెం: ప్రభుత్వ పాఠశాలల్లో అమలు చేస్తున్న జగనన్న గోరుముద్దలో భాగంగా విద్యార్థులకు రాగిజావ పంపిణీకి అవసరమైన స్టీల్ గ్లాసులను రాష్ట్ర ప్రభుత్వం గురువారం మండలాలకు సరఫరా చేసింది. దీనిలో భాగంగా గంపలగూడెం మండలంలోని 77 ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు అవసరమైన 4,934 గ్లాసులను ఉన్నతాధికారులు సరఫరా చేసినట్లు ఎంఈఓ సోమశేఖర్‌నాయక్ తెలిపారు. వీటిని గంపలగూడెం ఎమ్మార్సీలో దిగుమతి చేసుకున్నామన్నారు. విద్యార్థుల సంఖ్యను బట్టి పాఠశాలల వారీగా అవసరమైన గ్లాసులను ప్రధానోపాధ్యాయులకు అందజేసి విద్యార్థులకు వెంటనే పంపిణీ చేస్తామని చెప్పారు.

ఉత్సాహంగా జగనన్నే మా భవిష్యత్



తెల్లదేవరపల్లిలో ప్రభుత్వ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే రక్షణనిధి

తెల్లదేవరపల్లి(విస్సన్నపేట): పార్టీలకతీతంగా సంక్షేమ పథకాలు నేరుగా లబ్ధిదారుడికే వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అందిస్తోందని ఎమ్మెల్యే కొక్కిలిగడ్డ రక్షణనిధి అన్నారు. మండలంలోని తెల్లదేవరపల్లి గ్రామంలో జగనన్నే మా భవిషత్తు కార్యక్రమంలో గురువారం ఎమ్మెల్యే పాల్గొన్నారు. స్థానిక నాయకులతో కలిసి ఇంటింటికి వెళ్లి సంక్షేమ పథకాలు అమలుపై అడిగి తెలుసుకున్నారు.జగనన్నే మా భవిష్యత్తు స్టిక్కర్లు అంటించటంతో పాటు ప్రజాభిప్రాయ సేకరణ ప్రశ్నలు అడిగి నమోదు చేశారు. జెడ్పీటీసీ భీమిరెడ్డి లోకేశ్వరరెడ్డి, శివబాజీ, ఎంపీటీసీ చాట్ల మణి, దారావతు శ్రీను, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు పాల్గొన్నారు.

పథకాలపై విస్తృతంగా ప్రచారం

నూజివీడు: పట్టణంలోని అన్ని వార్డుల్లోను, మండలంలోని అన్ని గ్రామాల్లో గురువారం వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. దీనిలో భాగంగా మున్సిపల్ వైస్ చైర్మన్ పగడాల సత్యనారాయణ, గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు, ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల గురించి వివరించారు. ఇంటి యజమానుల అనుమతితో స్టిక్కర్లను అంటించారు.

చాట్రాయి: మండలంలోని అన్ని గ్రామాల్లో గురువారం వైఎస్సార్ సీపీ నిర్వహిస్తున్న జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమం ఇంటింటా జోరుగా సాగుతుంది. టీడీపీ, జగన్ ప్రభుత్వ పాలనకు ఉన్న తేడాను వివరించారు.

జగనన్నే మా భవిష్యత్‌కు విశేష స్పందన

ఇబ్రహీంపట్నం: జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తుంది. జూపూడిలో వైస్ ఎంపీపీ బాణావత్ నాగబాలమ్మ గత ప్రభుత్వం ఈ పథకాలు ఎందుకు అమలు చేయలేదో గుర్తించాలన్నారు. ఇబ్రహీంపట్నంలో స్థానిక సమస్యలపై ప్రజలు సూచించగా మున్సిపల్ సిబ్బందితో పరిష్కరింపజేశారు. లంకే అంకమోహనరావు, మునగాల శివారెడ్డి, వార్డు కౌన్సిలర్లు పాల్గొన్నారు.

మా నమ్మకం నువ్వే జగన్

తిరువూరు: మండలంలో గురువారం మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమాన్ని పలు గ్రామాల్లో నిర్వహించారు. తిరువూరు పట్టణంలోని 9, 16, 17, 19, 20 వార్డుల్లో కౌన్సిలర్లు మూడు దుర్గారావు, పరసా సత్యనారాయణ, షేక్ నదియా, వార్డు ఇన్‌చార్జిలు తిరుమలశెట్టి వేణుబాబు, షేక్ జాకీర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. మండలంలోని అక్కపాలెం, కోకిలంపాడు, రోలుపడి, ఎర్రమాడు గ్రామాల్లో సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, వైఎస్సార్ సీపీ నాయకులు మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమంలో ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాల లబ్ధిదారుల ఫీడ్ బ్యాక్ నమోదు చేశారు.

ముసునూరులో..

ముసునూరు: మండలంలోని అన్ని గ్రామాల్లో జగనన్నే మాభవిష్యత్తు కార్యక్రమాలు జోరుగా కొనసాగుతున్నాయి. జెడ్పీటీసీ సభ్యుడు, సచివాలయాల కన్వీనర్ వరికూటి ప్రతాప్ ఆధ్వర్యంలో సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, గ్రామ పెద్దలు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, రెట్టించిన ఉత్సాహంతో జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఎంపీపీ ఆర్.కృష్ణకుమారి సుబ్బారావు, వైస్ ఎంపీపీలు రాజానాయన, గంగాధర్ పాల్గొన్నారు.

ముమ్మరంగా జగనన్నే మా భవిష్యత్

ఆగిరిపల్లి: మండలంలో జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమం ముమ్మరంగా జరుగుతుంది. ప్రతి గ్రామంలో పార్టీ నాయకులు, గృహ సారథులు, సచివాలయాల కన్వీనర్లు, వలంటీర్లు ఇంటింటికీ పర్యటిస్తున్నారు. జెడ్పీటీసీ సభ్యుడు పిన్నిబోయిన వీరబాబు, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పల్లగాని నరసింహారావు, సర్పంచ్ పల్లగాని రమాదేవి జమదగ్ని పాల్గొన్నారు. తోటపల్లిలో బెజవాడ రాంబాబు, సూరవరంలో సర్పంచ్ గరికపాటి వీరవెంకటేశ్వరరావు, ఆగిరిపల్లిలో ఎంపీటీసీ సభ్యులు షేక్ షంసున్, సాదం గోపీనాథ్, చిమట శ్రీనివాసరావు ఆధ్వర్యంలో జగనన్నే మా భవిష్యత్ కార్యక్రామాన్ని నిర్వహించారు.

డ్వాక్రా గ్రూపు సభ్యులకు పొట్టేళ్ల పంపిణీ

ఏ.కొండూరు: డ్వాక్రా గ్రూపు మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందటానికి ప్రభుత్వం చేయూతనిస్తుందని స్థానిక ఎమ్మెల్యే కె.రక్షణనిధి అన్నారు. ఏ.కొండూరులో గురువారం చైతన్య మండల మహిళా సమైక్య ఆధ్వర్యంలో డ్వాక్రా గ్రూపు సభ్యులకు పొట్టేలు పంపిణీ చేశారు. మండలంలోని మాధవరం, రామచంద్రాపురం, చీమలపాడు, ఏ.కొండూరు, కోడూరు గ్రామాల్లో 14 యూనిట్లకు పొట్టేళ్లను పంపిణీ చేశామని ఒక్కొక్క యూనిట్ ధర రూ.50 వేలు విలువ ఉంటుందన్నారు. ఎంపీపీ కాలసాని నాగలక్ష్మి, జెడ్పీటీసీ భూక్యగనియా, సర్పంచ్ వెంపాటి రజిని, వైస్ ఎంపీపీ సిద్దం పద్మ, నాయకులు కాలసాని చెన్నారావు, సతీష్, సోలా నరసింహారావు, పాలం ఆంజనేయులు, ఎంపీడీఓ నాగేశ్వరరావు, ఏపీఎం ఆర్.సత్యం, వెలుగు సిబ్బంది పాల్గొన్నారు.

పొట్టేళ్ల పెంపకంతో లాభాలు ఆర్జించాలి

గంపలగూడెం: పొట్టేళ్ల పెంపకం ద్వారా స్వయం సహాయక సంఘాల మహిళలు లాభాలను ఆర్జించి, ఆర్థికాభివృద్ధి చెందాలని ఎంపీడీఓ వై.పిచ్చిరెడ్డి తెలిపారు. వైఎస్సార్ క్రాంతి పథం కార్యాలయం వద్ద నిర్వహించిన కార్యక్రమంలో 18 యూనిట్లకు మంజూరైన పొట్టేళ్లను లబ్ధిదారులకు అందజేశారు. పొట్టేళ్లను పెంచి విక్రయించడం ద్వారా తగిన లాభాలు పొందవచ్చని చెప్పారు. ఏపీఎం జె.నాగరాజు, మండల సమాఖ్య అధ్యక్షురాలు వెదురు లింగమ్మ, గోగులమూడి చెన్నకేశవరెడ్డి, కోట దాసు పాల్గొన్నారు.